క్లుప్తంగా

మోరి మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మృతి



సఖినేటిపల్లి: మోరి మాజీ సర్పంచ్ జాన విజయలక్ష్మి (71) బుధవారం అనారోగ్యంతో మృతి చెందారు. 2001-2006 మధ్య ఆమె సర్పంచ్‌గా పనిచేశారు. ఆమె భర్త జాన శంకరరావు (బాబ్జీ) ప్రముఖ పారిశ్రామికవేత్తగాను, వైఎస్సార్ సీపీ చేనేత విభాగం రాష్ట్ర నాయకుడిగా ఉన్నారు. ఈ మేరకు రొటేరియన్ కేవీ రామకృష్ణంరాజు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి జంపన బుజ్జిరాజు, డాక్టర్ రుద్రరాజు పద్మరాజు, పలువురు ప్రముఖులు శంకరరావును పరామర్శించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విద్యుత్ పొదుపు చేయాలి

రావులపాలెం: విద్యుత్తును పొదుపు చేసి భవిష్యత్ తరాలకు అందించడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ విద్యుత్ పొదుపుపై అవగాహన పెంచుకోవాలని ఎస్ఈ ఎస్.రాజబాబు అన్నారు. జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్లో విద్యుత్ వినియోగం, పొదుపు చేయడం, భవిష్యత్ తరాలకు అందించడం అనే అంశాలపై అవగాహన కల్పించారు. స్టార్ రేటెడ్ విద్యుత్ కారణాలు, సోలార్ విద్యుత్ వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో అమలాపురం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ వై.విజయానంద్, కొత్తపేట డీఈ చిట్టిరాజు, రావులపాలెం ఏఈ పి.నరేష్, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పది లీటర్ల సారా స్వాధీనం

కొత్తపేట: పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు ఎక్సైజ్ సీఐ కె.కాత్యాయని బుధవారం తెలిపారు. రావులపాలెం మండలం కొమరాజులంకకి చెందిన దాసరి నాగబాబు వద్ద పది లీటర్ల సారా స్వాధీనం చేసుకోవడంతో అతని అరెస్ట్ చేసి రాజోలు మెజిస్ట్రేట్ వద్ద హాజరుపరచగా 14 రోజుల రిమాండ్ విధించినట్టు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్సై కె.అన్నవరం, సిబ్బంది పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

సెల్‌ఫోన్ లాక్కుని పరారీ

మామిడికుదురు: మోటార్ సైకిల్‌పై వెళుతున్న వీఆర్వోను మాయమాటలతో బురిడీ కొట్టించి, అతడి సెల్‌ఫోన్ లాక్కుని ఇద్దరు యువకులు పరారయ్యారు. మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం వద్ద బుధవారం ఈ ఘటన జరిగింది. లూటుకుర్రుకు చెందిన పాలూరి పాండురంగారావు పెదపట్నం వీఆర్వోగా పనిచేస్తున్నారు. ఇంటి నుంచి విధి నిర్వహణ కోసం ఉదయం తొమ్మిది గంటలకు టీవీఎస్ ఎక్స్ఎల్‌పై పెదపట్నం వెళుతుండగా ఇద్దరు యువకులు బైక్‌పై ఆయనను అనుసరించారు. మోటార్ సైకిల్ వెనుక చక్రం ఊగిపోతుందంటూ నమ్మించారు. వీఆర్వో మోటార్ సైకిల్ ఆపి చూసుకుంటున్న సమయంలో ఆయన జేబులోని సెల్‌ఫోన్ తీసుకుని పరారయ్యారు. ఈ మేరకు నగరం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు.

కళ్లాల్లో ధాన్యం.. కళ్లల్లో దైన్యం

- రైతులను ముంచిన అల్పపీడనం
- తడిసి ముద్దయిన వరి పనలు, ధాన్యపు రాశులు

మామిడికుదురు: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో కురిసిన భారీ వర్షం రైతులను నిండా ముంచింది. ఎంతో కష్టపడి సాగు చేసిన పంట తడిసి ముద్దయిందని రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లాల్లోని ధాన్యం రాశులు, పొలాల్లోని పనలు, ఎండు గడ్డి తడిసిపోయాయని రైతులు వాపోయారు. గత నెలలో ఏర్పడిన తుపాను గండం నుంచి గట్టెక్కామని ఊపిరి పీల్చుకుంటున్న వేళ అల్పపీడనం తమకు తీరని నష్టాన్ని మిగిల్చిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అల్పపీడన ప్రభావంతో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ఈ వర్షానికి మాగాణీ రైతులు తీవ్రంగా నష్టపోయారు. పొలంలోని వరి పనలు తడవడం వల్ల ధాన్యం మొలకలు వచ్చే అవకాశం ఉందన్నారు. ధాన్యం తడిసిపోవడంతో నష్టం తప్పదన్నారు. ఎంతో విలువ చేసే ఎండుగడ్డి కూడా తడిసి పోవడంతో నష్టం ఎక్కువగా ఉందన్నారు.

50 శాతం పైబడి కోతలు....

మామిడికుదురు మండల పరిధిలో 2564 ఎకరాల విస్తీర్ణంలో రైతులు ఖరీఫ్ పంట సాగు చేశారు. దీనిలో 1550 ఎకరాల్లో కోతలు పూర్తయ్యాయని ఏవో బి.మృదుల తెలిపారు. సుమారు 150 ఎకరాలకు పైగా పంట కోత కోసి పనలపై ఉంది. సుమారు 250 టన్నులు ధాన్యం కళ్లాల్లో ఉంది. మిగిలిన పంట కోత దశకు వచ్చింది. కోత కోసి నూర్చిన ధాన్యం రాశులపై బరకాలు కప్పినప్పటికీ భారీ వర్షంలో ధాన్యం తడిసిపోయిందని రైతులు పేర్కొన్నారు. పనలపై ఉన్న పంట కూడా తడిసిపోయింది. భారీ వర్షంతో కోత దశకు వచ్చిన పంట నేలకొరిగింది. వర్షానికి వరి కంకులు బరువెక్కి నేలకొరిగిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కోత కోసి నూర్చిన తర్వాత ఎండు గడ్డి కళ్లాలోని, పంట పొలాల్లోను ఉండి పోయిందని, భారీ వర్షానికి ఎండు గడ్డి పూర్తిగా తడిసి పోయిందని రైతులు వాపోయారు.



మామిడికుదురులో తడిసి ముద్దయిన వరి పనలు



మామిడికుదురులో తడిసిన ధాన్యం రాశుల వద్ద దిగాలుగా రైతులు

అకాల వర్షానికి రైతుల ఉరుకులు పరుగులు

అయినవిల్లి: అల్పపీడనం కారణంగా రెండు రోజులుగా ముసురు పట్టి వర్షాలు కురువడంతో రైతులు ఉరుకులు పరుగులు పెడుతున్నారు. మండలంలోని నేదునూరు, అయినవిల్లి, విలస, సిరిపల్లి, మడుపల్లి గ్రామాల్లో ఇంకా వరి కోతలు కొనసాగుతున్నాయి. యంత్రాలతో కోసిన ధాన్యం రైతులు కళ్లాల్లోను, రోడ్లపైన ఆరబెడుతున్నారు. అల్పపీడనం రైతులకు కునుకు లేకుండా చేస్తుంది. ధాన్యాన్ని రోడ్లపై రాశులుగా చేసి బరకాలు కప్పి ఉంచారు. ఆరిన ధాన్యాన్ని బస్తాల్లో ఉంచి రోడ్లపై టార్పాలిన్లు వేశారు.

రెండెకరాల్లో ధాన్యం తడిసిపోయింది



రెండెకరాల్లో పంట కోత కోసి నూర్చిన తర్వాత ధాన్యం రాశి చేసి దానిపై బరకాలు కప్పాం. భారీ వర్షానికి ధాన్యం మొత్తం తడిసి పోయింది. ఎకరానికి 20 బస్తాల దిగుబడి వస్తుందనుకున్నాం. కానీ వర్షం వల్ల దిగుబడి తగ్గుతుంది. ఎకరానికి అయిదు బస్తాలు వంతున దిగుబడి తగ్గే అవకాశం ఉంది. ఎన్నో వ్యయ ప్రయాసలు కోర్చి పంట పండించినా చివరకు కన్నీళ్లే మిగిలాయి. పెట్టుబడి కూడా వచ్చే అవకాశం లేదు.

– యన్నాబత్తుల పెద్దిరాజు, రైతు, మామిడికుదురు

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



అయిదు కుంచాలు భూమి కౌలుకు తీసుకుని పంట పండించా. కోత కోసి నూర్చిన తర్వాత భారీ వర్షానికి ధాన్యం తడిసిపోయింది. భారీ వర్షం వల్ల తీవ్రంగా నష్టం వచ్చింది. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి రైతులను ఆదుకోవాలి. ప్రతి ఏడాది పంట చేతికి వచ్చే సమయంలో వర్షం దారుణంగా దెబ్బతీస్తోంది. భారీ వర్షం వల్ల దిగుబడి తగ్గడంతో పాటు తక్కువ రేటుకు ధాన్యం కొనే పరిస్థితి ఏర్పడుతుంది. దీని వల్ల పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి కనిపించడం లేదు.

– నయినాల కాశీవిశ్వనాథం, రైతు, మామిడికుదురు

భారీ వర్షంలో తీవ్ర నష్టం



రెండెకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేశాం. కోత కోశాం. కొంత నూర్చగా ఇంకా కొంత పనలపై ఉండిపోయింది. నూర్చిన ధాన్యం రాశిగా వేయగా ధాన్యం తడిసిపోయింది. పనలపై ఉన్న పంట కూడా తడిసిపోయింది. దీంతో పాటు కళ్లంలోనే ఉన్న ఎండుగడ్డి తడిసి ముద్దయింది. భారీ వర్షంతో తీవ్రంగా నష్టం ఏర్పడింది. పరిహారం అందించి ప్రభుత్వం మమ్మల్ని ఆదుకోవాలి.

– బొడ్డపల్లి వీరాస్వామి, కౌలు రైతు, మామిడికుదురు

విఘ్నేశ్వరునికి సంకష్టహర చతుర్థి పూజలు



పుష్పాలంకరణలో విఘ్నేశ్వరస్వామి



పెదపళ్లలో వేంచేసిన బాలగణపతి

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామికి ఆలయ ప్రధానార్చకుడు అయినవిల్లి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో బుధవారం సంకష్టహర చతుర్థి పూజలు జరిపారు. స్వామికి విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. స్వామిని వివిధ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. 1680 మంది స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. స్వామికి బుధవారం ఒక్క రోజు రూ.2,78,049 ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

ఘనంగా సంకష్టహర చతుర్థి

ఆలమూరు: మార్గశిర మాస సంకష్టహర చతుర్థి సందర్భంగా బుధవారం మండల వ్యాప్తంగా గణనాథుడి ఆలయాల్లో బుధవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదపళ్ల బాల గణపతి ఆలయంలో నిర్వహించిన అభిషేకం గరిక అర్చన తదితర పూజలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. చింతలూరు లక్ష్మీ గణపతి ఆలయంలో సంకష్టహర గణేశ హోమం నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి ఈ కార్యక్రమాలను తిలకించారు.

రోడ్డు అభివృద్ధి చేయాలంటూ ధర్నా



లూటుకుర్రులో రోడ్డు అభివృద్ధి కోరుతూ ధర్నా చేస్తున్న స్థానికులు

మామిడికుదురు: అధ్వానంగా మారిన లూటుకుర్రు కాలువగట్టు రోడ్డు అభివృద్ధి చేయాలని కోరుతూ స్థానికులు బుధవారం ధర్నా చేశారు. చినుకులు పడితే రోడ్డు చిత్తడిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కనీసం నడచి వెళ్లేందుకు కూడా రోడ్డు అనువుగా లేదన్నారు. 25 ఏళ్ల క్రితం రోడ్డు వేశారని, మళ్లీ దాని అలనా, పాలనా పట్టించుకున్న వారు లేకుండా పోయారన్నారు. కూటమి నేతలు, అధికారులు రోడ్డు అభివృద్ధిపై స్పందించాలని డిమాండ్ చేశారు. కాలువ గట్టు పరిధిలో అన్ని కులాలకు చెందిన వారు నివాసం ఉంటున్నారని చెప్పారు. రోడ్డు పాడైపోవడం వల్ల స్కూల్స్‌కు వెళ్లే విద్యార్థులతో పాటు స్థానికులకు అవస్థలు తప్పడం లేదన్నారు. వైద్య పరమైన అత్యవసర సమయాల్లో తమ పరిస్థితి వర్ణనాతీతంగా ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డు సమస్యపై తక్షణం స్పందించాలని నినాదాలు చేశారు. ఈ ధర్నాలో బొంతు బాలరాజు, బొంతు రాంబాబు, కడలి రామకృష్ణ, బొంతు భీమారావు, తాతారావు, జాలెం సరోజిని, కత్తుల అన్నపూర్ణ, యార్లగడ్డ వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.మల్లికార్జున్ అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతి కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, పెనికేరు, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు.గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్–బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటి బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యాన్నదానానికి విరాళం



దాత కుటుంబ సభ్యులకు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఐ.పోలవరం మండలం ఎదురులంకకు చెందిన ముదునూరి సూర్యావతి ఆమె కుటుంబ సభ్యులు బుధవారం రూ.10,200 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు. దాతను ఆలయ అర్చక, ఆలయ సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

జెడ్పీ చైర్మన్ పరామర్శ

మామిడికుదురు: సోదర వియోగంతో బాధపడుతున్న పాశర్లపూడి గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు తోరం సూర్యభాస్కర్‌ను జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు బుధవారం పరామర్శించారు. భాస్కర్ అన్నయ్య తోరం రామచంద్రరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన నేపథ్యంలో అతని సోదరుడు భాస్కర్‌ను జెడ్పీ చైర్మన్ వేణుగోపాలరావు పరామర్శించి, సానుభూతి తెలియజేశారు. రామచంద్రరావు చిత్రపటం వద్ద పుష్పాలు ఉంచి నివాళులర్పించారు. ఆయన వెంట మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షులు నెల్లి దుర్గాప్రసాద్, గ్రామశాఖ అధ్యక్షులు చిక్కం బుజ్జిబాబు, పార్టీ నేతలు అల్లు బుజ్జి, పిల్లి శ్రీనివాస్, అడ్డగళ్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

ముగిసిన కిక్ బాక్సింగ్ పోటీలు

రాజోలు: ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ ఇంటర్ కొలిగేట్ టోర్నమెంట్ కిక్ బాక్సింగ్ పోటీలు బుధవారం ముగిశాయి. యూనివర్శిటీ పరిధిలోని సుమారు 12 కళాశాలలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. వీరిలో 16 మంది విశ్వవిద్యాలయాల స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించారు. ఓవరాల్ టీం చాంపియన్ షిప్‌గా మహిళా విభాగంలో రాజమహేంద్రవరం ఎస్‌కేవీటీ కళాశాల, పురుషుల విభాగంలో రాజోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు నిలిచాయి. పోటీలకు ఆదికవి నన్నయ యూనివర్శిటీ పరిశీలకుడిగా డాక్టర్ బి.రామ్‌గోపాల్, సభ్యులుగా డాక్టర్ బాపిరెడ్డి, సీహెచ్.సతీష్, రిఫరీలుగా అంజనీకుమార్, గిరిబాబు, భవానీ శంకర్‌లు వ్యవహరించారు. ప్రిన్సిపాల్ సాయిబాబు విజేతలకు ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. వైస్ ప్రిన్సిపాల్ పద్మనాభం, స్పోర్ట్స్ ఇన్‌చార్జి నల్లి రాజు, రిటైర్డ్ ఎంఈఓ జొన్నలగడ్డ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కిక్ బాక్సింగ్‌లో ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించిన క్రీడాకారులు

కొత్తపేటలో..

కొత్తపేట: స్థానిక విశ్వకవి వేమన ప్రభుత్వ డిగ్రీ కళాశాల చెందిన విద్యార్థులు రాజోలు గవర్నమెంట్ డిగ్రీ కాలేజీలో గత రెండు రోజులుగా నిర్వహించిన కిక్ బాక్సింగ్ టోర్నమెంట్లో తమ కళాశాల నుంచి ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు సీహెచ్ పృథ్వీరాజ్, కె.సతీష్‌లు (బంగారు), ఎం.వంశీ, కె.అనిల్‌కుమార్, పి.లక్ష్మీనారాయణలు (వెండి), బి.ప్రభాస్, బీఆర్‌డీ సాయికుమార్ (కాంస్య)పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను పీడీలు కె.అంకమరావు, కె.కనకరాజు తదితరులు అభినందించారు.

రావులపాలెంలో..

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థులు కిక్ బాక్సింగ్‌లో రాజోలులో జరిగిన నన్నయ యూనివర్సిటీ కొలిగేట్ ఇంటర్ కాలేజీ మీట్‌లో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించినట్టు కళాశాల పీడీ యువరాజు బుధవారం తెలిపారు. బీఏ తృతీయ సంవత్సర చదువుతున్న ఎస్.విజయరాజు 91 కేజీల విభాగంలో గోల్డ్ మెడల్, వి.వరసత్య ప్రసాద్ 67 కేజీల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించారన్నారు. వీరిని ప్రిన్సిపాల్ వి. శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ అధికారి ఎస్.అరుణ్‌కుమార్ తదితరులు అభినందించారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

అంబాజీపేట: గ్రామాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, ప్రణాళికాబద్ధంగా పనిచేస్తూ గ్రామాలను అభివృద్ధి పథంలో నిలపాలని ఎంపీడీఓ జీవీ సరోవర్ అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రెండో రోజు బుధవారం సర్పంచ్‌లకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఎల్ఎస్‌డీఎస్ పథకం, ప్రజారోగ్య లక్ష్యాలు, హెల్దీ విలేజ్, చైల్డ్ ఫ్రెండ్లీ విలేజ్, సురక్షిత మంచినీరు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు: గ్రామ పంచాయతీలను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో పయనించేందుకు వీలుగా ఐక్యరాజ్యసమితి సూచనల మేరకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) చేపట్టిందని కొత్తపేట డీఎల్‌డీఓ ఎస్‌టీవీ రాజేశ్వరరావు అన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంతో ఎంపీడీఓ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈశిక్షణ సదస్సుకు ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ఆయన మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సూచించిన తొమ్మిది అంశాల్లో రెండు అంశాలను ఎన్నుకుని 2024–2025 ఆర్థిక సంవత్సరంలో సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ ఉద్యోగులు సహకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. పరిపాలన అధికారి ఎం.మెహెర్ ప్రకాష్, హెచ్ఈ ఏవీవీ రాజా, జేఏ ఎస్‌కే వలీ తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో జరిగిన రాష్ట్రీయ గ్రామ స్వరాజ్య అభియాన్ శిక్షణలో ప్రసంగిస్తున్న డీఎల్‌డీఓ రాజేశ్వరరావు

అయినవిల్లి: గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే దేశ ప్రగతి సాధ్యపడుతుందని ఎంపీడీఓ జి.భీమారావు అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆర్జీఎస్ఏలో భాగంగా సర్పంచులు, ఎంపీటీసీలకు, అధికారులకు శిక్షణ నిచ్చారు. ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో 9 అంశాలపై అభివృద్ధి ఆధారపడి ఉంటుందన్నారు. ఆరోగ్యం, పారిశుధ్యం, ప్రభుత్వ పథకాలు వాటిని సద్వినియోగం చేసుకోవడం వంటి మొదలగు అంశాలపై ఆయన అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వాణిశ్రీ బెహరా, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పి.గన్నవరం: గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రతినిధులు, అధికారులు కృషి చేయాలని ఎంపీడీఓ కేవీ ప్రసాద్ అన్నారు. మండలంలోని సర్పంచ్‌లు, పంచాయతీల కార్యదర్శులకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జరిగిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. గ్రామాల అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ ఉమామహేశ్వరరావు, ఎంఈఓ కోన హెలీనా, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ రికార్డుల ప్రక్షాళన

రాజోలు: రెవెన్యూ సదస్సులతో భూ రికార్డుల ప్రక్షాళన జరుగుతుందని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. బుధవారం శివకోడు గ్రామంలో సర్పంచ్ నక్కా రామారావు అధ్యక్షతన జరిగిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే వరప్రసాద్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. రెవెన్యూ సదస్సులో దరఖాస్తులను పరిష్కరించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 33 దరఖాస్తులు వచ్చాయని, రైస్‌కార్డులు, గృహనిర్మాణం, పింఛన్ల కోసం సుమారు 60 దరఖాస్తులు వచ్చాయని తహసీల్దార్ ప్రసాద్ తెలిపారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం, సందేహాలను రెవెన్యూ గ్రామ సభల ద్వారా నివృత్తి చేసుకోవాలని తహసీల్దార్ జె.వెంకటేశ్వరి అన్నారు. మాచవరం సచివాలయం –2లో గ్రామ రెవెన్యూ సభలను సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి అధ్యక్షతన బుధవారం జరిగింది. తహసీల్దార్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారం కోసమే సభలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభలో పలువురు రైతులు నుంచి భూ సమస్యలు, పాస్‌బుక్ సమస్యలు, రీ సర్వే మ్యుటేషన్‌లకు సంబంధించిన అంశాలపై 6 దరఖాస్తులు వచ్చాయన్నారు.

ఆలమూరులో..

ఆలమూరు: మండలంలో రైతులందరికీ భూములకు సంబంధించి నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించుకునేందుకు ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి కె.నాగేశ్వరరావు, తహసీల్దార్ కేజే ప్రకాష్‌బాబు అన్నారు. ఆలమూరు మండలంలోని గుమ్మిలేరులో బుధవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు జరిగింది. సర్పంచ్ గుణ్ణం రాంబాబు అధ్యక్షతన స్థానిక పంచాయతీ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ఈ సదస్సులో ప్రత్యేక అధికారి నాగేశ్వరరావు, తహసీల్దార్ ప్రకాష్‌బాబు పాల్గొని కక్షిదారుల నుంచి అర్జీలు సేకరించారు. రెవెన్యూ సంబంధిత సమస్యలపై తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి నిర్ణీత గడువు లోపల పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. అలాగే సంక్షేమ పథకాల కోసం అందిన దరఖాస్తులను సంబంధిత అధికారులకు నివేదిస్తామని తెలియజేశారు. డీటీ టి.సుబ్బరాజు, ఆర్ఐ రామాయమ్మ, వీఆర్ఓ సున్నం గణేష్, తదితరులు పాల్గొన్నారు.



శివకోడు సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్



పాశర్లపూడిలో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ ఆచార్యులు

మామిడికుదురులో..

మామిడికుదురు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచార్యులు, మండల ప్రత్యేకాధికారి ఎస్‌జేవీ రామ్మోహనరావు పేర్కొన్నారు. పాశర్లపూడి గ్రామ పంచాయతీ వద్ద బుధవారం రెవెన్యూ సమస్సు జరిగింది. ఈ సదస్సులో రెవెన్యూ సమస్యలపై పలువురు దరఖాస్తులు అందజేశారు. సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం సదస్సులు ఏర్పాటు చేసిందని తహసీల్దార్ పేర్కొన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. సదస్సులో సర్పంచ్ కొనుకు ప్రేమ జ్యోతి, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, ఉప సర్పంచ్ తుండూరి బుజ్జి, పలు శాఖలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.



అయినవిల్లిలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగలక్ష్మమ్మ

అయినవిల్లిలో..

అయినవిల్లి: తమకు గతంలో ఇళ్ల పట్టాలు ఇచ్చామని గత పాలకులు చెప్పారు. కానీ ఇప్పటికీ ఇళ్ల పట్టాలు గానీ, ఇళ్ల స్థలాలు చూపించలేదని, తాము ఇళ్ల నిర్మించుకోవడానికి ఇళ్ల పట్టాలు, ఇళ్ల స్థలాలు కావాలని కొండుకుదురు గ్రామ మహిళలు తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మను కోరారు. బుధవారం కొండుకుదురు, పొట్టిలంక గ్రామాల్లో తహసీల్దార్ ముఖ్యఅతిథిగా రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రెవెన్యూ సదస్సుల ద్వారా భూసమస్యలు సత్వరం పరిష్కారం చేస్తామన్నారు. అడంగల్ కరెక్షన్స్ కోసం ఇరువురు, మ్యుటేషన్లకు ముగ్గురు, సర్వే కోసం ఒకరూ అర్జీలు చేసుకున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచులు మేడిద దుర్గాప్రసాద్, కోనే సునీత సుబ్బలక్ష్మి, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.